కనిపించిందా జాగా.. వేసేయ్ పాగా



ఆక్రమణకు గురైన కృష్ణపట్నం కాలువ



రోడ్డు పక్కన జోరుగా నిర్మాణం

- కబ్జాకు గురవుతున్న కృష్ణపట్నం కాలువ
- ఖాళీ చేయించిన స్థలాల్లోనే తిరిగి ఆక్రమణలు
- ఇప్పటికే పలు దుకాణాల ఏర్పాటు
- నిర్మాణంలో మరికొన్ని
- పట్టించుకోని అధికారులు

నెల్లూరు(బారకాసు): నగరం రోజురోజుకూ అభివృద్ధి చెందుతుండటంతో పాటు విస్తరిస్తోంది. దీంతో కొద్దిపాటి స్థలం కొనాలన్నా, అంకణం ఖరీదు లక్షల్లో పలుకుతోంది. దీంతో ఎక్కడైనా కాస్త స్థలం ఖాళీగా కనిపిస్తే వెంటనే దాన్ని కొందరు ఆక్రమించేస్తున్నారు. తాజాగా నగరంలోని ప్రభుత్వ ఖాళీ స్థలాలపై ఆక్రమణదారులు కళ్లు పడ్డాయి. వీటిని కబ్జా చేసి ఇతరులకు విక్రయించి రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. ముత్తుకూరు గేట్ జంక్షన్ నుంచి నారాయణ వైద్య కళాశాలకు వెళ్లే ముత్తుకూరు ప్రధాన రహదారిపై ఈ తంతు జరుగుతోంది.

జోరుగా కబ్జా

సర్వేపల్లి ప్రధాన కాలువ నుంచి ముత్తుకూరు వైపు వెళ్లే కృష్ణపట్నం కాలువ వెంబడి ఉన్న ఖాళీ స్థలం కబ్జాకు గురవుతోంది. ఇప్పటికే కాలువకు సంబంధించిన స్థలంలో పలు దుకాణాలను ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. మరికొందరు కొత్తగా నిర్మాణాలను జరుపుతున్నారు. తమనెవరూ ప్రశ్నించరనే ధీమాతో దీన్ని నిరంతరాయంగా సాగిస్తున్నారు.

మరోసారి యథావిధిగా

కొన్నేళ్ల పాటు మౌనం వహించిన ఆక్రమణదారులు తిరిగి సదరు స్థలాల్లోనే దుకాణాల ఏర్పాటుకు నిర్మాణాలు సాగించారు. మరోవైపు ఎలాంటి నిర్మాణాలు జరపరాదని హెచ్చరిస్తూ జలవనరుల శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి మరీ ఆక్రమణల పర్వానికి తెరలేపారు. కృష్ణపట్నం కాలువ గట్టు స్థలాన్ని కబ్జా చేసి ఇతరులకు రూ.లక్షలకు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పెద్దల హస్తం..

కృష్ణపట్నం కాలువ స్థల కబ్జాకు గురవుతున్న వ్యవహారం వెనుక ఓ పెద్ద హస్తం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ తంతు జరుగుతున్నా, జలవనరుల అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు చేపడుతున్న దాఖలాల్లేవు. మరోవైపు నగరంలో ఎక్కడా అనుమతుల్లేకుండా అక్రమ నిర్మాణాలు జరపకూడదని, అలా చేపడితే వెంటనే తొలగించాలని మంత్రి నారాయణ పలుమార్లు ఆదేశించారు. అయితే దీన్ని అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆక్రమణలను తొలగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అప్పట్లో ఇదీ జరిగింది..

కృష్ణపట్నానికి వెళ్లే కాలువ గట్టును దాదాపు 20 ఏళ్ల క్రితమే కొందరు ఆక్రమించి ఇళ్లు, దుకాణాలను నిర్మించుకున్నారు. ఈ క్రమంలో నగరం నుంచి ముత్తుకూరు, కృష్ణపట్నం పోర్టుకు రాకపోకలు అధికమయ్యాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువై వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. పరిస్థితిని గమనించిన అప్పటి ప్రజాప్రతినిధులు ముత్తుకూరు రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించారు. దీనికి అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. అనంతరం ఆక్రమణలను తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2011, ఫిబ్రవరి 11న ముత్తుకూరు రోడ్డులో ప్రార్థన మందిరాల మినహా మిగిలిన నిర్మాణాలను తొలగించారు.

అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం

ముత్తుకూరు గేట్ జంక్షన్ నుంచి నారాయణ వైద్య కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి ఉన్న కృష్ణపట్నం కాలువకు చెందిన స్థలంలో ఆక్రమణలు వాస్తవమే. ఖాళీ చేయాలని అక్కడున్న వారికి నోటీసులను జారీ చేశాం. మరోసారి అందజేసి అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం.

– అనిల్‌కుమార్‌రెడ్డి, డీఈఈ, జలవనరుల శాఖ సెంట్రల్ డివిజన్



నిర్మాణంలో ఉన్న దుకాణం

క్లుప్తంగా

'నలంద'లో సంబరాలు



నెల్లూరు (టౌన్): బాలాజీనగర్‌లోని నలంద స్కూల్లో దసరా సంబరాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి వేషధారణలతో విద్యార్థులు అలరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, హెచ్‌ఎం హేమలత తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలకు ఎంపిక



నెల్లూరు (టౌన్): ఏసీనగర్‌లోని రత్నం స్కూల్ విద్యార్థి సాత్విక్ అండర్ – 14 విభాగంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ మహబూబ్‌బాషా తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని గురువారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలని కాంక్షించారు.

బస్ పాస్ సేవలకు తాత్కాలిక అంతరాయం

నెల్లూరు సిటీ: నెల్లూరు రెండో డిపో పరిధిలోని పీఎస్సార్ బస్‌స్టేషన్లో బస్ పాస్ కౌంటర్‌లో సేవలు ఈ నెల ఐదు, ఆరో తేదీల్లో అందుబాటులో ఉండవని మేనేజర్ శివకేశవ్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్‌లో అంతరాయం కారణంగా సేవలు తాత్కాలికంగా ఉండవని చెప్పారు.

కేంద్రీయ విద్యాలయంలో నేడు, రేపూ పోటీలు

నెల్లూరు సిటీ: ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్‌ను పురస్కరించుకొని కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలను శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శంకరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు క్లస్టర్‌లోని తొమ్మిది పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొననున్నారని చెప్పారు. సోలో సాంగ్స్, గ్రూప్ డ్యాన్స్ తదితర పోటీలను నిర్వహించనున్నామని, విజేతలకు బహుమతులను శనివారం అందజేయనున్నామని వివరించారు.

సేవల పునరుద్ధరణకు వినతి

నెల్లూరు (టౌన్): మీ సేవ నుంచి గతంలో తొలగించిన సేవలను పునరుద్ధరించేలా కృషి చేయాలని మీ సేవ, ఈ సేవ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ అనిల్‌కుమార్ కోరారు. ఈ మేరకు నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డికి వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. అసోసియేషన్ నేతలు ముక్తియార్ అహ్మద్, దామోదర్, మదన్, ప్రసాద్, శ్రీనివాసులు, మీ సేవ నిర్వాహకులు దొరబాబు, రాఘవేంద్ర, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

నెల్లూరు (టౌన్): దసరా సెలవుల్లో ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో తరగతులను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి పేర్కొన్నారు. నగరంలోని శ్రీచైతన్య, విశ్వసాయి జూనియర్ కళాశాలలను ఆర్ఐఓ శ్రీనివాసులుతో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే కళాశాలల యాజమాన్యాలపై చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. జీసీడీఓ మమత, ఏసీడీఎస్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సమత పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో వీధి కుక్కలను గురువారం పట్టుకున్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యపై సచివాలయ సిబ్బందికి స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో కుక్కలను పట్టి ప్రత్యేక వాహనంలో తరలించారు.

నేటి నుంచి మెడికల్ కళాశాల వార్షికోత్సవం

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల పదో వార్షికోత్సవాన్ని విహంగ – 24 పేరిట శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందు ఆధ్వర్యంలో వేడుకలు జరగనున్నాయి.

బీఎల్‌ఏలను నియమించుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్పెషల్ సమ్మరీ రివిజన్, 2025లో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ఈ నెల 29న ప్రచురించనున్నామని చెప్పారు. అభ్యంతరాలను నవంబర్ 28 వరకు స్వీకరించి.. డిసెంబర్ 24లోపు పరిష్కరించి.. వచ్చే ఏడాది జనవరి ఆరున తుది జాబితాను ప్రచురించనున్నామని వెల్లడించారు. డీఆర్వో లవన్న, వివిధ పార్టీలకు చెందిన చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, మురళీధర్‌రెడ్డి, బాలసుధాకర్, శ్రీనివాస్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో చూపును ప్రసాదించొచ్చు



నేత్రదాన సర్టిఫికెట్ ప్రదానం

నెల్లూరు(అర్బన్): నేత్రదానంతో చూపును ప్రసాదించొచ్చని సింహపురి దేహ సమర్పణ సంస్థ కన్వీనర్, నేత్రదాన మోటివేటర్ విజయ పేర్కొన్నారు. హరనాథపురంలోని రామాలయ వీధిలో నివాసం ఉంటున్న నెల్లూరు సులోచనమ్మ బుధవారం రాత్రి మృతి చెందారు. ఈ క్రమంలో ఆమె నేత్రాలను కుమారుడు భక్తవత్సలరెడ్డి దానం చేశారు. నేత్రాలను మోడరన్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ వేణు సేకరించారు. అనంతరం నేత్రదాన సర్టిఫికెట్‌ను కుటుంబసభ్యులకు అందజేశారు.

అందుబాటులో ఆధునిక దంత వైద్యం



మాట్లాడుతున్న శ్రీనాథ్

నెల్లూరు(అర్బన్): ఆధునిక దంత వైద్యాన్ని ఒకే చోట అందించాలనే లక్ష్యంతో రోబో సేవలతో కూడిన శ్రీనాథ్ సూపర్ స్పెషాల్టీ దంత వైద్యశాలను ప్రారంభించామని డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పొగతోటలో వైద్యశాలను ప్రారంభించిన అనంతరం విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రోబోతో కూడిన వైద్యసేవలను నెల్లూరులో మొదటిసారిగా ప్రారంభించామని వివరించారు. ఎవరైనా ఈ రోబో వద్ద నిలబడి ఫోన్ నంబర్‌ను నమోదు చేసి నోరు తెరిస్తే.. అది స్కాన్ చేసి దంత సమస్యలు, తీసుకోవాల్సిన చికిత్సపై వివరాలను వాట్సాప్ ద్వారా పంపుతుందని వివరించారు. రోబో స్కాన్ సేవలను నెల పాటు ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలంటూ ధర్నా



నెల్లూరు(దర్గామిట్ట): సనాతన హిందూ ధర్మాన్ని కాపాడాలనే డిమాండ్‌తో హిందూ సమాజ నిరసన ర్యాలీని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నాను చేపట్టారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. రామాయణం మహేష్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయాల వద్ద ఆందోళన



నెల్లూరు(అర్బన్): ఎల్ఐసీ ఏజెంట్లకు కమీషన్ తగ్గించడంపై.. పాలసీదారుల లోన్లపై వడ్డీ రేట్లు పెంచడాన్ని నిరసిస్తూ జిల్లాలోని అన్ని బ్రాంచ్‌ల వద్ద ఏఓఐ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనను గురువారం చేపట్టారు. దర్గామిట్టలోని సీబీ – 1, బృందావనంలోని సీబీ – 2, పూలే విగ్రహ సమీపంలోని సీఏబీ బ్రాంచ్‌ల వద్ద నిరసనను తెలియజేశారు. ఏజెంట్లు, పాలసీదారులకు నష్టం కలిగేలా ఐఆర్డీఏ, ఎల్ఐసీ మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీబీ – 1 ఏఓఐ కార్యదర్శి మదన్, మేకల నరసింహారావు, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'జయభారత్'లో వస్త్రాల అందజేత



నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ ఆస్పత్రిలో పలువురు వర్కర్లకు వస్త్రాలను రంగనాథ, రాజరాజేశ్వరి భక్తిమండలి సభ్యులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ మోర్చా నేత సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడారు. భక్తమండలి సభ్యుడు మెంటా రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో 20 ఏళ్లుగా వస్త్రాలను పంపిణీ చేస్తుండటాన్ని అభినందించారు. బీజేపీ నేత మిడతల రమేష్, రామానందగిరి స్వామి, బయ్యా బద్రినారాయణ, బాల, మువ్వల రాంబాబు, కృష్ణ, సునీల్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక



అమరేంద్రనాథ్‌రెడ్డి



రాము

నెల్లూరు(అర్బన్): ఐఎంఏ జిల్లా అధ్యక్షుడిగా అమరేంద్రనాథ్‌రెడ్డిని సభ్యులు గురువారం ఎన్నుకున్నారు. నగరంలోని ఐఎంఏ హాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024 – 25కు గానూ అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. నెల్లూరు మెడికల్ సొసైటీ చైర్మన్‌గా రామును ఎన్నుకున్నారు. తమను ఎంపిక చేయడంలో సహకరించిన ప్రస్తుత అధ్యక్షుడు ఎమ్వీఎస్ రెడ్డి, ఎన్నెమ్మెస్ చైర్మన్ రమణయ్యకు కృతజ్ఞతలను తెలియజేశారు.

ఉత్తర్వులను అమలు చేయరూ..

నెల్లూరు (టౌన్): దసరా సెలవుల ఉత్తర్వులను జిల్లాలోని అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పక్కాగా అమలు చేయాలని పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నరహరి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి రాజశేఖర్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రైవేట్ కళాశాలల్లో తరగతులను నిర్వహిస్తున్నా, ఇంటర్ బోర్డు అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో 4, 5వ డివిజన్ల పార్టీ నేతలు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలను తెలియజేశారు.

హామీని సీఎం నిలబెట్టుకోవాలి



నెల్లూరు(దర్గామిట్ట): విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద గురువారం చేపట్టిన నిరసనలో వారు మాట్లాడారు. సెప్టెంబర్ 27న నాలుగు వేల మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయమన్నారు. చిరసాని కోటిరెడ్డి, వెంగయ్య, రమణయ్య, షానవాజ్, జనార్దన్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఉచిత ఇసుకను అమలు చేయాలి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని చిత్తశుద్ధితో తక్షణమే అమలు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బాలాజీనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. నగరంలో ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.ఐదు వేల నుంచి రూ.తొమ్మిది వేలు.. టిప్పర్ ఇసుకను రూ.25 వేల నుంచి రూ.60 వేలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యుడు సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు నరసింహ, చిరంజీవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


జయహే.. జగన్మాత



గాయత్రిగా మహాలక్ష్మమ్మ



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో..



సీతారామస్వామి మందిరంలో..

నెల్లూరు(బృందావనం): నగరంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగవైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. నగరంలోని ఆలయాల్లో కొలువైన జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

- నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో కలశస్థాపనను నిర్వహించారు. అమ్మవారు చండీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు, వెంకటనాగలక్ష్మి, సుబ్బారావు, లలిత, గుత్తా రామ్మోహన్, సరిత దంపతులు వ్యవహరించారు. అమ్మవారికి పట్టువస్త్రాలను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు సమర్పించారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కలశస్థాపన, ప్రాణప్రతిష్ఠను నిర్వహించారు. తొలుత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థాన ప్రాంగణంలోని పెన్నా తీరం నుంచి 1008 మంది మహిళలు 1008 కలశాల్లో నదీ జలాలతో కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు చేరుకున్నారు. వంద కిలోల వెండితో తయారు చేసిన రథంతో శోభాయాత్ర కనుల పండువగా సాగింది. అమ్మవారు భవానిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా దొంతంశెట్టి వెంకటేశ్వర్లు, సుజన, మల్లికార్జునరావు, లక్ష్మి దంపతులు, కొలిపాకుల సురేష్‌బాబు, సురేంద్రబాబు వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, గౌరవాధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు షణ్ముగరావు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి జనార్దన్‌రావు పాల్గొన్నారు.
- ఏసీనగర్‌లోని కోదండరామపురంలో గల మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు గాయత్రిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వాసిపల్లి నారాయణరెడ్డి, విజయమ్మ, నూతేటి వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, వాకా శ్రీనివాసులురెడ్డి, రమాదేవి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ పత్తి నరసింహం, సభ్యులు శ్రీనివాసులు, కాటేపల్లి వెంకటరమణయ్య వీరరాఘవులు, దామెర చంద్రమౌళి, వెంకటసుబ్బయ్యనాయుడు, శ్రీనివాసులురెడ్డి, గోవిందరాజులు, చంద్రారెడ్డి తదితరులు పర్యవేక్షించారు.
- విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా మాలకొండయ్య, సాయిపూర్ణిమ, అంబూరు మునిరాజా, అనూరాధ, శ్రీనివాస ఆచారి, లక్ష్మి వ్యవహరించారు. నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ శాశ్వత అధ్యక్షుడు కందుకూరు చెంగయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, అలిమేలి సుబ్రహ్మణ్య ఆచారి, రమణయ్య, దండపాణి సురేష్ తదితరులు పాల్గొన్నారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. ధనలక్ష్మీహోమం, సత్యనారాయణస్వామి వ్రతం, అష్టలక్ష్మి వైభవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా ఘంటసాల రేవతికుమార్, ఉషారాణి దంపతులు వ్యవహరించారు. మందిర నిర్వాహకులు వెంకటసత్యనారాయణ, సోమిశెట్టి వెంకటరత్నం, తన్నీరు మస్తాన్‌రావు పర్యవేక్షించారు.



వెంకటేశ్వరపురంలో..

- నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు స్కంధమాత అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వెంకటనాగశాస్త్రి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈఓ కవిత పాల్గొన్నారు.
- నవాబుపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా నాగయ్య, సుజన దంపతులు వ్యవహరించారు.
- సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి మందిరంలో అమ్మవారు గౌరీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా అజయ్‌కుమార్, లక్ష్మీశారద, సురేంద్రకుమార్, పద్మావతి దంపతులు వ్యవహరించారు.
- కంసాలివీధిలో గల భ్రమరాంబ సమేత హరిహరనాథస్వామి దేవస్థానంలో అమ్మవారు పార్వతిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా నాగేశ్వరరెడ్డి, లావణ్య దంపతులు వ్యవహరించారు. శ్రీనివాసులు, సుకన్య దంపతులు, మురళి పర్యవేక్షించారు.
- ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు.
- మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో అమ్మవారు భవానిగా దర్శనమిచ్చారు. ఈఓ శ్రీనివాసరావు, గిరీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.
- మూలాపేటలోని ధర్మరాజస్వామి దేవస్థానంలో కలశస్థాపనను నిర్వహించారు.

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మి అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. విశేష పూజలను ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఈఓ గోపీ పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం తదితరాలను నిర్వహించారు. లక్ష్మీనారాయణ అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. కోలాట ప్రదర్శనను గోకుల కోలాట బృంద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, రాజేశ్వరి దంపతులు, చందలూరి శ్రీనివాసులు, పద్మావతి దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకుడు సాయిభరద్వాజ పాల్గొన్నారు.



ధర్మరాజస్వామి దేవస్థానంలో..



అష్టలక్ష్మి మందిరంలో..



హరిహరనాథస్వామి దేవస్థానంలో..

రేషనలైజేషన్‌పై సమావేశం



మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): రేషనలైజేషన్‌పై పలు పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కమిషనర్ సూర్యతేజ గురువారం నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటి సర్వేలో ఏమైనా అభ్యంతరాలుంటే వాటిని తెలియజేయాలని కోరారు. సిటీ నియోజకవర్గ పరిధిలో ఒకే డోర్ నంబర్‌లో ఎక్కువ ఓట్లుంటే వాటిని పరిశీలించి సరిదిద్దేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ సందర్భంగా పలు అంశాలను రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజేశారు. ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, రాజశేఖర్, బాలసుధాకర్, శ్రీరామ్, హరికృష్ణ, అశోక్, అర్బన్ తహసీల్దార్ షఫీమాలిక్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌రావు, జూనియర్ అసిస్టెంట్ చక్రపాణి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను వంద రోజుల్లో పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్ పేర్కొన్నారు. వేదాయపాళెంలోని కార్యాలయంలో ఆ శాఖ ఇంజినీర్లతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు.